వాషింగ్టన్‌లో జరుగుతున్న ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల్లో యోగా చేస్తున్న ఔత్సాహికులు

వైభవంగా సాంస్కృతిక ఉత్సవాలు

10 లక్షల మందికిపైగా హాజరు

శ్రీశ్రీ రవిశంకర్

వాషింగ్టన్, అక్టోబర్ 1: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాలు వాషింగ్టన్‌లో వేడుకగా సాగుతున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమాల్లో వివిధ దేశాల నృత్య కళాకారుల ప్రదర్శనలు అబ్బురపర్చాయి. ఇక్కడి నేషనల్ మాల్‌లో శ్రీశ్రీ రవిశంకర్ ఆధ్వర్యంలో విశ్వమానవ హృదయ స్పందన కార్యక్రమం ఘనంగా జరిగింది. 180 దేశాలకు చెందిన ప్రజలు ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం ప్రార్థించారు. ఆయా దేశాల జాతీయ జెండాల మధ్య 180 దేశాల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యగాన రీతులు వీక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మారిషస్ అధ్యక్షుడు పృథ్విరాజ్ సింగ్ రూపున్, జపాన్ దివంగత ప్రధాని షింజో అబే సతీమణి అకీ అబే, అమెరికాలో ప్రముఖ సర్జన్ డాక్టర్ వివేక్‌మూర్తి.. తదితరులు రెండో రోజు కార్యక్రమంలో ప్రసంగించారు. రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ, ప్రపంచ ప్రజా వాహిని అంతా ఇక్కడ సమావేశమైందన్నారు. రెండో రోజు ఆదివారం ప్రముఖ భారతీయ అమెరికన్ గాయకుడు, గ్రామీ అవార్డు గ్రహీత ఫాలు షా నేతృత్వంలో 10 వేలమందితో గార్బా నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఐర్లాండ్ కళాకారుల స్టెప్ డ్యాన్స్, అఫ్గానిస్థాన్ కళాకారుల గీతాలాపన, వెయ్యిమంది చైనీస్-అమెరికన్ గాయకులు, కళాకారుల నృత్య ప్రదర్శన అందర్నీ అబ్బురపర్చింది. తొలి రోజున జరిగిన కార్యక్రమాలను దాదాపు 10 లక్షలమంది ప్రత్యక్షంగా వీక్షించినట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రకటించింది.

సముద్ర కెరటాల్లో తేలిగా నిల్చున్న ఈ సింహం గుజరాత్‌లోని జునాగఢ్‌లో ఉన్న అరేబియా సముద్ర తీరంలో దర్శనమిచ్చింది. జునాగఢ్ చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ ఈ ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశారు. అలలతో ఆడుకుంటున్న ఈ సింహం ఫొటోను షేర్ చేస్తూ నార్నియా నిజమైందంటూ ఐఎఫ్ఎస్ అధికారి పర్వీన్ కశ్వన్ తెలిపారు.

విపక్షమే టార్గెట్!

రాజకీయ భవన్‌లుగా రాజ్‌భవన్‌లు

- బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడమే వాటి విధి
- పరాకాష్ఠకు చేరిన గవర్నర్ల తీరు
- తెలంగాణ సహా పలు విపక్ష పార్టీల పాలిత రాష్ట్రాల్లో ఇదే తంతు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): గవర్నర్ వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ సర్కార్ భ్రష్టు పట్టిస్తున్నది. రాజ్యాంగ పరిరక్షకులుగా వ్యవహరించాల్సిన గవర్నర్లను కేంద్రం తన రాజకీయ ప్రతీకారాలు, ప్రయోజనాల కోసం వాడుకొంటున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు గవర్నర్ వ్యవస్థను వ్యతిరేకించిన ప్రధాని మోదీ, ఇప్పుడు అదే గవర్నర్లను బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడానికి, ఇబ్బంది పెట్టడానికి పావులుగా వినియోస్తున్నారు. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అక్కడి టీఎంసీ ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టారు. అందుకు నజరానాగానే ఆయనకు ఉపరాష్ట్రపతి పదవి వరించిందన్న విమర్శలూ ఉన్నాయి. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న పశ్చిమ బెంగాల్, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, తెలంగాణ, గతంలో మహారాష్ట్రలో గవర్నర్ల వ్యవహారశైలి ఆ వ్యవస్థనే ప్రశ్నార్థకంగా మార్చింది. తాజాగా తెలంగాణ గవర్నర్ తమిళిసై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు చేసిన ప్రతిపాదనలను తిప్పిపంపడంతో గవర్నర్ వ్యవస్థ దుర్వినియోగంపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. గవర్నర్ల అరాచకీయం బీజేపీ సర్కార్ హయాంలో పరాకాష్ఠకు చేరుకొన్న నేపథ్యంలో గవర్నర్ల వ్యవస్థ దేశానికి అవసరమా? అనే చర్చను లేవదీస్తున్నది.

తమిళనాడులో అన్ని పక్షాలు ఏకం

తమిళనాడులో గవర్నర్‌కు వ్యతిరేకంగా పాలక పక్షానికి ప్రతిపక్షాలు కూడా మద్దతు పలకడం విశేషం. గవర్నర్ గిరీకి వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ఎదుట నిరసన ప్రదర్శన కూడా జరిగింది. సీఎం స్టాలిన్ సిఫారసు చేయకుండానే మంత్రి సెంథిల్‌ను గవర్నర్ నేరుగా బర్తరఫ్ చేయడంపై తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. ఈ అసాధారమైన నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు స్టాలిన్ హెచ్చరించడంతో గవర్నర్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకొన్నారు.

మంత్రినే మార్చాలన్న కేరళ గవర్నర్

కేరళ గవర్నర్ ఆరిఫ్ ఖాన్‌కు అయితే ఏకంగా ఒక మంత్రి తనకు నచ్చలేదు. 'రేపటి'లోగా ఆయనతో రాజీనామా చేయించమని నేరుగా సీఎం విజయన్‌కే సిఫారసు చేశారు. మంత్రిని రాజీనామా చేయమని కోరే అధికారం గవర్నర్‌కు ఎక్కడిది? అని ఆ అంశం పెద్ద వివాదం అయింది. ఇంకా అక్కడ ఇలాంటి చర్యలు ఎన్నో జరిగాయి.

తెల్లవారుజామున ప్రమాణస్వీకారం

ప్రభుత్వ ఏర్పాటుకు మెజార్టీ లేకపోయినా గవర్నర్ భగత్‌సింగ్ కోష్యారీ గుట్టుచప్పుడు కాకుండా తెల్లవారుజామున రాజ్‌భవన్‌లోబీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌తో ప్రమాణస్వీకారం చేయించి ప్రజాతీర్పును అభాసుపాలు చేసిన తెలిసిందే. దీనిపై ప్రజాగ్రహం వ్యక్తం కావడంతో శివసేన-కాంగ్రెస్-ఎన్సీపీ సంకీర్ణ ప్రభుత్వంతో ప్రమాణ స్వీకారం చేయించాల్సి వచ్చింది.

ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ రాకున్నా..

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 250 కార్పొరేటర్లకుగాను 134 స్థానాలను గెలుచుకున్నది. 15 ఏండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఓటమి పాలైనప్పటికీ ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా గవర్నర్ నామినేటెడ్ సభ్యులను నియమించి, వారికి ఓటు కల్పించి బీజేపీని అధికార పీఠంపై కూర్చోబెట్టడానికి విశ్వప్రయత్నాలు చేశారు. దీన్ని ఆప్ సుప్రీంకోర్టులో సవాల్ చేయడంతో నామినేటెడ్ సభ్యుల నియామకాన్ని రద్దు చేశారు.

పంజాబ్‌లో హామీల అమలుకు అడ్డుపుల్ల

పంజాబ్‌లో ఆప్ అధికారంలోకి వచ్చింది. ఇది నచ్చని కేంద్రంలోని బీజేపీ సర్కార్ గవర్నర్ ద్వారా అక్కడి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించింది. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా గవర్నర్ అడుగడుగునా అడ్డుతగిలారు. చివరకు శాసనసభ సమావేశాలను నిర్వహించుకోవడానికి గవర్నర్ అనుమతి నిరాకరించారు. ఒకదశలో ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేస్తానని కూడా గవర్నర్ భన్వారిలాల్ పురోహిత్ హెచ్చరించారు.

తమిళనాడు గవర్నర్ రవికి వ్యతిరేకంగా చెన్నైలో వెలిసిన పోస్టర్లు

తెలంగాణలో ప్రతీదానికి మోకాలడ్డు

తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న బీసీ నాయకుడు డాక్టర్ శ్రవణ్, ఎరుకల సామాజిక వర్గానికి చెందిన కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సిఫారసు చేయగా గవర్నర్ తమిళిసై తిరస్కరించిన విషయం తెలిసిందే. అంతకుముందు కూడా ఇలాగే ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డి పేరునూ తిరస్కరించారు. యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లుతో పాటు అనేక బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపకుండా, తిరస్కరించకుండా నెలల తరబడి తన వద్దనే అట్టిపెట్టుకోవడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును కూడా ఆమోదించకుండా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూశారు. గవర్నర్ నాన్చుడు ధోరణిపై ఆర్టీసీ కార్మికులు ఆందోళన బాట పట్టడంతో ఎట్టకేలకు ఆమోదించక తప్పలేదు. ఓ వైపు యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఏబీవీపీ ద్వారా ఆందోళనలు చేయించేది బీజేపీనే. మరోవైపు ఆ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం బిల్లు పంపిస్తే గవర్నర్ ద్వారా ఆపేది కూడా బీజేపీయేననే విమర్శలు పెద్దయెత్తున వస్తున్నాయి.

దళిత ఇంజినీర్‌పై సహోద్యోగుల దాడి

బీజేపీ పాలిత గుజరాత్‌లో ఘటన

గాంధీనగర్ : దొంగతనం ఆరోపణలపై ఓ దళిత ఇంజినీర్‌పై సహోద్యోగులు దాడి చేశారు. తీవ్రంగా కొట్టడంతో గాయాలైన బాధితుడు ప్రస్తుతం దవాఖానలో చికిత్స తీసుకొంటున్నాడు. ఈ ఘటన బీజేపీ పాలిత గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో తాజాగా చోటుచేసుకొన్నది. నిందితులందరూ పలన్‌పూర్‌లోని ఓ ప్రైవేట్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పుట్టిన రోజు పార్టీ ఉందని చెప్పి తోటి ఉద్యోగులు బాధిత ఇంజినీర్‌ను కారులో తీసుకెళ్లారు. మధ్యలో ఓ చోట వాహనం ఆపి, డీజిల్ దొంగతనం చేశావని ఆరోపిస్తూ దళిత యువకుడిపై దాడి చేశారు. గుజరాత్‌లో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఎస్సీ నేత హితేంద్ర పితాదియా అన్నారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు గడిచిందని, అయితే ఇప్పటి వరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. ఇది దళితుల పట్ల గుజరాత్ బీజేపీ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నదని విమర్శించారు.

ఛత్రపతి శివాజీ శౌర్యానికి ప్రతీకగా నిలిచే పులి గోళ్లు (వాఘ్ నఖ్) ఆయుధాన్ని వచ్చేవారం భారత్‌కు తీసుకురానున్నారు. 17వ శతాబ్దానికి చెందిన ఈ పులి గోళ్లు ఆయుధంతోనే 1659లో బీజాపూర్ ఆర్మీ కమాండర్ అఫ్జల్ ఖాన్‌ను మరాఠా నేత శివాజీ ముఖాముఖీ యుద్ధంలో హతమార్చినట్టు చరిత్ర చెబుతున్నది.

జమ్ముకశ్మీర్‌లో 300 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

జమ్ము: జమ్ముకశ్మీరులోని రాంబన్ జిల్లాలో ఉగ్రవాద-మాదక ద్రవ్యాల ముఠా గుట్టును రట్టు చేసినట్లు జమ్ము జోన్ అదనపు డీజీపీ ముకేశ్ సింగ్ తెలిపారు. కశ్మీరు నుంచి జమ్ము వెళ్తున్న ఓ వాహనాన్ని సోదాలు చేశారని చెప్పారు. ఈ వాహనంలో సుమారు 30 కేజీల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారని, దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.300 కోట్లు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో అరెస్టయిన ఇద్దరూ పంజాబ్‌కు చెందినవారని తెలిపారు.

అమెరికాలోని ఫ్రెస్నో నగరంలో కులవివక్షపై నిషేధం

వాషింగ్టన్: కుల వివక్షను నిషేధిస్తూ అమెరికాలోని మరో నగరం తీర్మానం చేసింది. దీనికి సంబంధించి మున్సిపల్ కోడ్‌ను కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఫ్రెస్నో నగర మున్సిపాల్టీ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో కుల వివక్షను నిషేధించిన రెండో నగరంగా ఫ్రెస్నో గుర్తింపు అందుకుంది. 'తీర్మానం చేయటాన్ని స్వాగతిస్తున్నా. ఒక్క రోజులో ఈ వివక్ష అంతం కాదు' అని ఫ్రెస్నో సిటీ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ అన్నాలిసా పెరియా అన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28% పన్ను అమల్లోకి

న్యూఢిల్లీ : జీఎస్టీ చట్టంలో తీసుకొచ్చిన సవరణలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందేలపై 28 శాతం పన్ను విధింపు ఆదివారం(అక్టోబర్ 1) నుంచి అమల్లోకి వచ్చింది. జీఎస్టీ సవరణ బిల్లును ఆగస్టులో లోక్‌సభలో ఆమోదింపజేసుకొన్నది. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందేలపై 28 శాతం పన్ను విధించాలని జూలై 11న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర సర్కార్‌కు ప్రతిపాదనలు చేసింది.

సైనికులకూ కేంద్రం ధోకా

- వైకల్య పెన్షన్ నిబంధనలు కఠినతరం
- 10 ఏండ్ల సర్వీసు ఉంటేనే వర్తిస్తాయని షరతు
- కేంద్రంపై మాజీ సైనికుల సంఘం ఆగ్రహం
- సాధారణ ఉద్యోగులకు లేని నిబంధనలు సైనికులకా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): సైనికుల త్యాగాలను రాజకీయ లబ్ధికి వాడుకొని అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్, తన అసలు బుద్ధి బయటపెట్టుకుంది. సర్వీసులో ఉండగా వైకల్యం పొందిన సైనికులకు ఇచ్చే 'డిసెబిలిటీ పెన్షన్' నిబంధనల్ని కఠినతరం చేసింది. డిఫెన్స్ సిబ్బంది, వారి వితంతువులకు ఇచ్చే పెన్షన్ నిబంధనల్ని మార్చింది. వైకల్యం పెన్షన్ పొందేందుకు ఆఫీసర్ ట్రెనీస్, క్యాడెట్స్‌కు అర్హత లేదంటూ కొత్త నిబంధనావళి పేర్కొన్నది. ఈ మేరకు సెప్టెంబర్ 22న రక్షణశాఖ జారీచేసిన నిబంధనావళిపై విపక్షాలు, మాజీ సైనికుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మోదీ సర్కార్ తీరును ఆల్ ఇండియా ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. పెన్షన్ ఎగవేసేందుకే కొత్త నిబంధనల్ని కేంద్రం తీసుకొచ్చిందని ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ వైస్ చైర్మన్ బీమ్‌సెన్ సెహగల్ మండిపడ్డారు.

10 ఏండ్ల సర్వీసు ఉంటేనే పెన్షన్

తాజా ఉత్తర్వుల ప్రకారం, పదేండ్ల సర్వీసు కలిగి ఉంటేనే మాజీ సైనికులు, వారి వితంతువులు వైకల్య పెన్షన్ పొందడానికి అర్హులు అవుతారు. శిక్షణ కాలంలో వైకల్యానికి గురయ్యే సైనికులకు వర్తించదు. కొత్తగా విధించిన షరతులు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు పూర్తిగా విరుద్ధమని సెహగల్ అన్నారు. సాధారణ ఉద్యోగులకు లేని నిబంధనలను సైన్యంలో పని చేసిన వారికే పెట్టడంలో ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు.

మణిపూర్ విద్యార్థుల హత్య కేసులో నలుగురి అరెస్టు

ఇంఫాల్, అక్టోబర్ 1: మణిపూర్‌లో ఈ ఏడాది జూలైలో చోటుచేసుకొన్న ఇద్దరు విద్యార్థుల హత్య కేసులో సీబీఐ నలుగురిని అరెస్టు చేసింది. రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నది. అరెస్టు అయిన వారిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. నిందితుల్లో ఒకరు హత్యకు గురైన విద్యార్థిని స్నేహితురాలని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నలుగురు నిందితులను సీబీఐ అధికారులు విమానంలో అస్సాంలోని గువాహటికి తరలించారు. అంతకుముందు మణిపూర్ పోలీసులు, భారత ఆర్మీ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో చురాచంద్‌పూర్ జిల్లాలో హత్య కేసు అనుమానిత నిందితులను పట్టుకొన్నారు. అనంతరం వారిని ఇంఫాల్ ఎయిర్‌పోర్టుకు తీసుకెళ్లి, అక్కడ సీబీఐకి అప్పగించారు. అక్కడి నుంచి నిందితులను అస్సాంకు తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకొన్నారన్న సమాచారం నేపథ్యంలో కొంత మంది ప్రజలు ఎయిర్‌పోర్టు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో నిందితులను తీసుకెళ్లాల్సిన విమానం టేకాఫ్ అయ్యే వరకు కొంత టెన్షన్ వాతావరణం నెలకొన్నదని భద్రతా వర్గాలు తెలిపాయి.

వాణిజ్య సిలిండర్‌పై మోత

- ఏకంగా రూ.209 పెంచిన కేంద్రప్రభుత్వం
- వరుసగా నాలుగో నెల విమాన ఇంధన ధరలు పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 1: కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై ధరల మోత మోగించింది. 19 కేజీల కమర్షియల్ సిలిండర్‌పై రూ.209 పెంచేసింది. దీంతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,731.50, ముంబైలో రూ.1,684 కి చేరింది. అయితే గృహ అవసరాలకు వినియోగించే 14.2 ఎల్పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం మార్పు చేయలేదు. విమానాలకు ఇంధనంగా ఉపయోగించే ఏటీఎఫ్ ధరను కిలోలీటర్‌కు రూ.5,779(5.1 శాతం) పెంచింది. ఏటీఆర్ ధరలను పెంచడం జూలై నుంచి వరుసగా ఇది నాలుగోసారి కావడం గమనార్హం. ఈ మేరకు ప్రభుత్వ ఆయిల్ కంపెనీలు ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశాయి. వాణిజ్య సిలిండర్ ధరలపెంపు వలన హోటళ్లు, రెస్టారెంట్లపై భారం పడనున్నది. ఈ ప్రభావం ధరల రూపంలో వినియోగదారులపై చూపే అవకాశం ఉన్నది. ఏటీఎఫ్ గత నాలుగు నెలల్లో మొత్తంగా దాదాపు రూ.29,391 మేర పెరిగింది. దీని వలన విమాన సంస్థల నిర్వహణ ఖర్చు కూడా దాదాపు 40 శాతం మేర పెరిగినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

'లఖింపూర్' బాధిత రైతులకు న్యాయమేదీ?

లఖింపూర్ ఖీరీ: ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖీరీలో కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా తన కాన్వాయ్‌తో రైతులను తొక్కించి చంపిన ఘటనకు మంగళవారంతో రెండేండ్లు పూర్తి అవుతున్నది. అయితే ఈ హింసాకాండ బాధితులకు ఇప్పటి వరకు న్యాయం జరుగలేదు. కేసు విచారణ నత్తనడకన సాగుతున్నదనే వినిపిస్తున్నాయి. ప్రధాన నిందితుడైన ఆశిష్ మిశ్రా ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉండగా.. కేంద్ర మంత్రిగా ఉన్న అతని తండ్రి అజయ్ మిశ్రాను పదవి నుంచి తొలగించాలన్న రైతు సంఘాల డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు. నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో భాగంగా రైతులు ఆందోళనలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 2021, అక్టోబర్ 3న లఖింపూర్‌లో ఆందోళన చేస్తున్న రైతులపైకి ఆశిష్ కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు రైతులు మరణించారు. లఖింపూర్ ఘటనకు నిరసనగా ఈ నెల 3న 'బ్లాక్ డే'గా పాటించనున్నట్టు రైతు సంఘాలు ఆదివారం ప్రకటించాయి. ప్రధాని మోదీ, అజయ్ మిశ్రా, ఆశిష్ మిశ్రా దిష్టిబొమ్మలు దహనం చేస్తామని తెలిపాయి.

మూడేండ్ల చిన్నారికి నామకరణం చేసిన హైకోర్టు

కొచ్చి : వేర్వేరుగా జీవిస్తున్న దంపతులు తమ మూడేళ్ల కుమార్తెకు పేరును నిర్ణయించడంలో ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. 2020 ఫిబ్రవరి 12న జన్మించిన ఆ చిన్నారి తన తల్లి వద్దనే ఉంటున్నది. ఆమె జనన ధ్రువీకరణ పత్రంలో పేరు లేకపోవడంతో ఆమె తల్లి జనన, మరణాల రిజిస్ట్రార్ కార్యాలయంలో పేరును నమోదు చేయించేందుకు ప్రయత్నించారు. పేరు రిజిస్ట్రేషన్ చేయాలంటే తల్లిదండ్రులిద్దరూ తన సమక్షంలో హాజరుకావాల్సిందేనని ఆ రిజిస్ట్రార్ చెప్పారు. దీంతో ఆ తల్లి కేరళ హైకోర్టును ఆశ్రయించారు. ఆ బాలికకు తల్లి సూచించిన పేరుతోపాటు తండ్రి పేరును కూడా జత చేసి హైకోర్టు నామకరణం చేసింది.

గంటకు 1000 కిలోమీటర్లు

- హైపర్‌లూప్‌ను అభివృద్ధి చేస్తున్న ఐఐటీ- మద్రాస్ విద్యార్థులు
- చెన్నై-బెంగళూరు 30 నిమిషాల్లోనే
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టెస్టింగ్

ఐఐటీ-మద్రాస్ అభివృద్ధి చేసిన హైపర్‌లూప్ వద్ద విద్యార్థులు

చెన్నై, అక్టోబర్ 1: చెన్నై నుంచి బెంగళూరుకు 30 నిమిషాల్లో మీరు వెళ్లగలరా? 30 నిమిషాల్లోనే 350 కిలోమీటర్ల దూరమా.. 4 గంటలకు పైగా సమయం పడుతుందని అనుకుంటున్నారా? వేర్వేరు రాష్ట్రాల్లో ఉన్న ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని 30 నిమిషాలకే పరిమితం చేయవచ్చని అంటున్నారు ఐఐటీ-మద్రాస్ విద్యార్థులు. హైపర్‌లూప్ అనే కొత్త టెక్నాలజీతో ఇది సాధ్యమేనని చెబుతున్నారు. ఐఐటీ-మద్రాస్‌కు చెందిన 50 మంది విద్యార్థులు 'ఆవిష్కార్ హైపర్‌లూప్' పేరిట బృందంగా ఏర్పడి ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇప్పటికే 400 మీటర్ల ప్రొటోటైప్ హైపర్‌లూప్ ట్యూబ్ (నమూనా)ను అభివృద్ధి చేశారు. గ్రీన్ ఎనర్జీతో నడిచే దీని వల్ల భవిష్యత్తులో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోనున్నాయి.

ఏమిటీ హైపర్‌లూప్?

భూమిపై అత్యధిక వేగంతో ప్రయాణించే వ్యవస్థనే హైపర్‌లూప్ అని పిలుస్తారు. తక్కువ పీడనం ఉండే మూసి ఉన్న టన్నెల్ లాంటి ట్యూబ్‌లో ప్రయాణికులు లేదా కార్గో కంపార్ట్‌మెంట్ అతివేగంతో ప్రయాణిస్తుంది. సాధారణంగా విమానాలు గంటకు 800-900 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. జపాన్‌లో నడిచే బుల్లెట్ రైళ్లు వేగం గంటకు 400-500 కిలోమీటర్లు మాత్రమే. కానీ ఈ హైపర్‌లూప్‌లో గంటకు 1000-1800 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లవచ్చు. ఈ హైపర్‌లూప్ అనే కాన్సెప్ట్‌ను మొదటగా 2012లో ఎలాన్ మస్క్ తెరపైకి తీసుకొచ్చారు. దీన్ని ఐదో ట్రాన్స్‌పోర్ట్ మోడ్‌గా మస్క్ అభివర్ణించారు.

రైల్వే ఆర్థిక సాయం

ఐఐటీ-మద్రాస్‌కు చెందిన విద్యార్థులు గత ఏడాది కేంద్ర ప్రభుత్వానికి దీని గురించి ప్రతిపాదనలు పంపించారు. దీంతో రైల్వే ఈ ప్రాజెక్టుకు రూ.8.34 కోట్ల నిధులను అందించింది. ఈ నిధులతో 400 మీటర్ల హైపర్‌లూప్ నమూనాను అభివృద్ధి చేశారు. ఈ నమూనాకు యూరోపియన్ హైపర్‌లూప్ వీక్ - 2023లో మూడో స్థానం దక్కింది.

తక్కువ పీడనాన్ని తట్టుకోగలరా?

అయితే తక్కువ పీడనం ఉండే వాతావరణంలో అల్ట్రా హై స్పీడ్‌ను మనుషులు తట్టుకుంటారా? లేదా అనేది ఇంకా తెలియలేదు. దీనిపైనే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ నమూనా ట్యూబ్‌ను కార్గో రవాణా నిమిత్తం పరీక్షించనున్నారు. ఇందులో సానుకూల ఫలితాలు వస్తే 10 కిలోమీటర్ల హైపర్‌లూప్ ట్యూబ్‌ను రూపొందించి ప్రయాణికులపై పరీక్షించాలని ఐఐటీ- మద్రాస్ బృందం భావిస్తున్నది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే మరో 10 ఏండ్లలో ఇది కార్యరూపం దాల్చే అవకాశం ఉంది.

ఎగిరే కారు వచ్చేస్తున్నది!

- రోడ్డుపై, గాల్లోనూ దూసుకుపోగలదు
- అభివృద్ధి చేస్తున్న అమెరికా కంపెనీ

కాలిఫోర్నియా, అక్టోబర్ 1: నగరాల్లో ట్రాఫిక్ సమస్యలతో విసిగిపోయారా? చందమామ కథల్లో చదివినట్టు రెక్కల గుర్రం ఉంటే ఎంచక్కా గాల్లో ఎగురుకుంటూ గమ్యస్థానానికి చేరుకోవచ్చని అనుకుంటున్నారా? అయితే మీ కల త్వరలో నిజం కాబోతున్నది. ఎగిరే కారు మార్కెట్లోకి రాబోతున్నది. రోడ్డుపై దూసుకుపోతూ.. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న చోట పక్షిలా రివ్వున గాల్లో ఎగిరిపోయే కారు అందుబాటులోకి రానున్నది. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ ఈ తరహా కారును అభివృద్ధి చేసింది. తాజాగా డెట్రాయిట్‌లో నిర్వహించిన ఆటో షోలో దీన్ని ప్రదర్శించారు.

ముందస్తు బుకింగ్‌లే 500..

ఈ ఏడాది జూన్‌లో అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ఈ కారుకు అనుమతులు మంజూరు చేసింది. ఇందులో ఇద్దరు ప్రయాణించవచ్చు. దీని ధర సుమారు రూ.2.46 కోట్లు. విద్యుత్తు శక్తితో నడిచే ఇది రోడ్డుపై 200 మైళ్ల వరకు ప్రయాణించగలదు. గాల్లో అయితే 110 మైళ్ల వరకు ఎగరగలదు. ఈ కారులో నుంచి 180 డిగ్రీల కోణంలో చూసే వెసులుబాటు ఉంది. అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ 2022లోనే ఈ కార్లను ముందస్తు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించగా.. ఇప్పటివరకు 500 వరకు బుక్ అయ్యాయి.